క్లుప్తంగా

మల్లన్న సేవలో విప్ దంపతులు


ఆలయం వద్ద విప్ కాపు దంపతులు

రాయదుర్గం: శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామిని శుక్రవారం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, కాపు భారతి దంపతులు దర్శించుకున్నారు. ఆలయ రాజగోపురం వద్ద దేవాదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో అర్చకులు వారికి సాదర స్వాగతం పలికారు. అనంతరం రత్నగిరి గణపతి స్వామిని దర్శించుకుని మహా మంగళ హారతి సేవలో వారు పాల్గొన్నారు. విప్ మాట్లాడుతూ మల్లన్న ఆశీస్సులతో ప్రజలంతా సుఖ, సంతోషాలు కలిగి ఉండేలా పూజలు నిర్వహించామన్నారు. విప్ వెంట వైఎస్సార్‌సీపీ నాయకుడు రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తక్షణ సాయం అందజేత

బ్రహ్మసముద్రం: మండంలోని వేపులపర్తి గ్రామానికి చెందిన సాకమ్మగారి చంద్రమౌళి ఇటీవల మృతి చెందాడు. శుక్రవారం వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయం రూ. 10 వేలను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవ రాజు, ఎంపీటీసీ బూసప్ప , సచివాలయ కన్వీనర్ తిప్పారెడ్డి తదితరులు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. మిగిలిన రూ. 90 వేలు త్వరలో నామినీ వ్యక్తిగత ఖాతాలో జమవుతుందన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

మారెమ్మ దేవత గ్రామోత్సవం


అలంకరణలో మారెమ్మ మూలవిరాట్

కూడేరు: స్థానిక పీర్ల మసీదు వద్ద ఉన్న మారెమ్మ దేవత గ్రామోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మారెమ్మ మూలవిరాట్‌కు క్షీరాభిషేకం చేసిన అనంతరం వివిధ రకాల పట్టు వస్త్రాలు, పుష్పాలతో విశేషంగా అలంకరించారు. సాయంత్రం మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తుల నోట మారెమ్మ అమ్మవారి నామస్మరణ మార్మోగింది. భక్తులకు అన్నదానం చేశారు.

గొర్రెల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న రామసుబ్బారెడ్డి

కళ్యాణదుర్గం రూరల్: గొర్రెల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలని ప్యాపిలి సహాయ సంచాలకుడు రామసుబ్బారెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కాపరులకు గొర్రెల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. గొర్రె పిల్లల సంరక్షణ, అంటువ్యాధుల నివారణ తదితర అంశాలపై వివరించారు. అనంతరం కాపరులకు గొర్రెలకు సంబంధించిన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏహెచ్ శ్రీనివాస్ గుప్త, డాక్టర్ రమేష్, మంజునాథ్. విరోబ్యాక్ వెట్ ఫార్మా ప్రతినిధులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చెట్టును ఢీకొట్టిన కారు

- నలుగురికి గాయాలు



బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లు క్రాస్ సమీపంలో బళ్లారి –కళ్యాణదుర్గం అంతర్‌రాష్ట్ర రహదారిలో శుక్రవారం మధ్యాహ్నం ఒక కారు చెట్టుకు ఢీకొంది. ఘటనలో ఒకరికి కాలు విరిగి మరో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాల మేరకు... కర్ణాటకలోని కంప్లికి చెందిన ధనుంజయ, పండరినాథ్, సుభాషిని, దీక్షిత కుటుంబ సభ్యులు కలసి కారులో కళ్యాణదుర్గంలోని వివాహ వేడుకల్లో పాల్గొని తిరిగి కంప్లికి బయలుదేరారు. ఉంతకల్లు క్రాస్ సమీపంలో అడ్డు వచ్చిన ఆవు దూడను తప్పించబోయి కారు అదుపు తప్పి చెట్టుకు ఢీకొంది. ఘటనలో ఫండరీనాథ్‌కు కుడికాలు విరిగింది. ధనుంజయ, సుభాషిని, దీక్షితకు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు వెంటనే బొమ్మనహాళ్ ప్రాథమిక వైద్య శాలకు తరలించారు. వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స అందించి అనంతరం మెరుగైన చికిత్స కోసం బళ్లారి విమ్స్‌కు తరలించారు.

దేశానికే ఆదర్శం ఆరోగ్య సురక్ష

కళ్యాణదుర్గం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శమని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని చాపిరి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రితో పాటు నియోజకవర్గ పరిశీలకుడు ఎంఆర్‌సీ రెడ్డి హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే విద్య, వైద్యానికి ప్రాధాన్యత పెరిగిందన్నారు. బాలింతలకు నెలకు సరిపడా సరుకులను అందిస్తున్నామన్నారు. ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి పేదవాడికీ ఉచితంగా వైద్యం అందిస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలను సచివాలయం ద్వారా నేరుగా అర్హులకు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దక్కుతుందన్నారు. ప్రజల సొమ్ము దోచుకున్నందుకు చంద్రబాబు జైల్లో ఉన్నాడని, తప్పు చేస్తే ఎవరినైనా చట్టం వదలదన్నారు. అంతకుముందు నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు 230 మందికి ఉచితంగా వైద్యం అందించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు విజయేంద్ర, ప్రత్యూష, మాధవీలత, ఎంపీడీఓ సాలమాన్, సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న, ఈఓఆర్‌డీ శంకర్, జెడ్పీటీసీ బొమ్మన్న, ఎంపీపీ మారుతమ్మ, వైస్ ఎంపీపీ లక్ష్మీకాంతమ్మ, పట్టణ కన్వీనర్ శ్రీనివాసులు, సర్పంచ్ హనుమంతప్ప, జేసీఎస్ కన్వీనర్ ఆంజనేయులు, నాయకులు తిమ్మారెడ్డి, యోగేష్, హనుమంతు, వెంకటేశులు,నాగరాజు, సోమశేఖర్‌రెడ్డి, బోరంపల్లి వాటర్ షెడ్ చైర్మన్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంటౌన్: పట్టణంలోని మున్సిపల్ అభ్యుదయ మోడల్ స్కూల్‌లో శుక్రవారం 11వ సచివాలయంలోని 18,19 వార్డుల ప్రజలకు ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష మెగా హెల్త్ శిబిరానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప హాజరై పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ దేశానికే ఆదర్శంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార కేంద్రాన్ని కౌన్సిలర్లు శారదదేవి, పొరాళ్ల గోవిందరాజులతో కలసి ఆమె పరిశీలించారు.


కళ్యాణదుర్గం మండలం చాపిరిలో గర్భిణులకు వైద్య కిట్లను పంపిణీ చేస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

రాయదుర్గం రూరల్: మండలంలోని టి.వీరాపురం గ్రామంలో ఎంపీడీఓ కొండయ్య టీం ఆధ్వర్యంలో శుక్రవారం జెడ్పీటీసీ మల్లికార్జున, సర్పంచ్ ఓబుళమ్మ వైద్య శిబిరం ప్రారంభించారు. బిరంలో 362 మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా , నలుగురిని రెఫర్ చేసినట్లు వైద్యుడు రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాజమ్మ, సచివాలయాల మండల కన్వీనర్ మురహరి, పాటిల్ రఘునాథ్ రెడ్డి, ఆంజనేయులు, మహేష్ , తహసీల్దార్ మారుతి, ఏఓ చిక్కణ్ణ, ఈఓపీఆర్డీ రంగనాయకులు, వైద్యులు మాధవ్ మోహన్ కుమార్, చిన్న పిల్లల వైద్యులు మహేష్, గైనకాలజిస్ట్ డాక్టర్ హరిణి, డా.ఆజాద్ ఖాన్, కంటివైద్య నిపుణులు కన్యాకుమారి , ఎంఈఓ వెంకటరమేష్ , ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షకీలాబేగం, వైద్యాధికారిణి మల్లేశ్వరి, సర్పంచ్ ముక్కన్న, ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన తదితరులు పాల్గొన్నారు.

కణేకల్లు: మండలంలోని జక్కలవడికి గ్రామంలో శుక్రవారం జరిగిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. సుమారు 412 మందికి వైద్యపరీక్షలు చేసినట్లు డాక్టర్ విజయ్ కుమార్‌నాయక్, సంధ్యలు తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ గూడెన్న, సర్పంచు శారదమ్మ, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, కణేకల్లు పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ టి.కేశవరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ యంత్రకాయల వన్నూరప్ప, నాయకులు హనుమంతరెడ్డి, గిర్రప్పరెడ్డి, ఆర్.రామక్రిష్ణ, భీమిరెడ్డి టైలర్ వెంకటేశులు, కెనిగుంట రామిరెడ్డి, హనుమంతరావు పాల్గొన్నారు.

ఉరవకొండ: మండల పరిధిలోని నెరిమెట్ల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శుక్రవారం విశేష స్పందన లభించింది. సర్పంచ్ యోగేంద్రరెడ్డి అధ్వర్యంలో జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, తహసీల్దార్ వరప్రసాద్, ఈడీటీ మునీంద్ర శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 340 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వశికేరి మహేష్, వైద్యులు శైలజ, మజహర్, పావని, వెంకటేష్‌నాయక్ పాల్గొన్నారు.

కూడేరు: మండలంలోని పి.నారాయణపురంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామచంద్ర, తహసీల్దార్ శేషారెడ్డి, సర్పంచ్ హనుమంతరెడ్డి, వైద్యులు సరిత, లక్ష్మీనారాయణ, సూపర్‌వైజర్ రవీంద్ర , పంచాయతీ కార్యదర్శి హరి తదితరులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండలంలోని పూలకుంట గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు రమేష్, బాలాజీనాయక్, రాంకిషోర్, సందేశ్‌కుమార్, మోహన్‌సాయి, కనకప్రియ 315 మందికి వైద్య సేవలను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధమ్మ, ఎంపీడీఓ నరసింహమూర్తి, సీహెచ్‌ఓ మురళీధర్, సూపర్‌వైజర్ ఆదిబయమ్మ తదితరులు పాల్గొన్నారు.

కంబదూరు: మండంలోని తిమ్మాపురం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు ఆసియా, ప్రసన్న కుమార్, ప్రవీణ్ కుమార్ సుమారు 280 మంది వైద్యపరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. అలాగే దృష్టి లోపం ఉన్నవారికి కళ్ల అద్దాలను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబు రెడ్డి, బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు, సర్పంచ్ సంధ్య, ఎంపీడీఓ సుధాకర్‌రాజు, నాయకులు హరినాథ్ , కదిరిదేవర పల్లి హనుమంతరాయుడు, విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ధనరాజ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరు: మండలంలోని చిన్నహోతురు ప్రాథమిక పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచు సుంకులమ్మ, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం కార్యదర్శి వెంకటరెడ్డి, బీసీ సె ల్ కార్యదర్శి విజయ్‌కుమార్, ఎంపీటీసీ నాగలక్ష్మి, వైద్యులు గంగాధర్, పద్మ, సర్దార్‌వలి, హరిత తదితరులు పాల్గొన్నారు.

విడపనకల్లు: మండలంలోని హంచనహాల్ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలోఎంపీపీ కరణం పుష్పావతి, వైస్ ఎంపీపీ రాకెట్ల పుష్పావతి, ఎంపీడీఓ శ్రీనివాసులు, మాజీ సర్పంచు కరణం భీంరెడ్డి,కేశన్న ఈఓఆర్డీ సత్యబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమారాణి, వైద్యులు ప్రతిమ, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శెట్టూరు: మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటనాయుడు, వైద్యులు అనూష, కార్తికేయ, తరుణ, సర్పంచ్ సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


క్యాంపులో హెల్త్ కిట్లను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కౌన్సిలర్ శారదాదేవి


రాయదుర్గం మండలం టి.వీరాపురం గ్రామంలో కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం


బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు గ్రామంలో రోగులకు మందులను పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది


ఉరవకొండ: నెరిమెట్లలో వైద్యశిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు


కూడేరు మండలం పీ నారాయణపురంలో వైద్య సేవలను పరిశీలిస్తున్న ఎంపీపీ నారాయణ రెడ్డి

సరస్వతీదేవి నమోనమః


కళ్యాణదుర్గం: సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు


ఉరవకొండ: సరస్వతీ అలంకరణలో జగదీశ్వరీ అమ్మవారు


సరస్వతీ అలంకరణలో ఉరగాద్రి చౌడేశ్వరీ అమ్మవారు


రాయదుర్గంటౌన్: విశేష అలంకరణలో శాంతినగర్‌లో వెలసిన పెద్ద బనీ మహంకాళి

రాయదుర్గంటౌన్: నవరాత్రి ఉత్సవాలు రాయదుర్గంలో భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆరో రోజు శుక్రవారం పట్టణంలోని కోటలో వెలసిన నగరేశ్వరీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాత భక్తులకు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. నేసేపేటలో వెలసిన చౌడేశ్వరీదేవి సరస్వతీదేవి అలంకరణ ఆకట్టుకుంది. అలాగే ఓబుళాచారి రోడ్డు వద్ద ఉన్న బన్ని మహంకాళమ్మ ఆలయం, శాంతినగర్‌లోని పెద్ద బన్ని మహంకాళి, హటకేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవి, కోటలోని కంసలవీధి వెలసిన కాళికాంబదేవి, లక్ష్మీబజార్‌లో వెలసిన శ్రీముదుగులమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

కళ్యాణదుర్గం: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్యం సంఘం ఆధ్వర్యంలో ఉదయం 6.30 గంటలకు పల్లకీ సేవ, 7 నుంచి 10.30 గంటలకు చండీ హోమం , ఇతర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

కణేకల్లు: కణేకల్లులోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో శుక్రవారం సరస్వతిదేవీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి పూజలు చేయించి మొక్కుబడులను తీర్చుకున్నారు.

వజ్రకరూరు: మండల కేంద్రంలోని లలితాత్రిపుర సుందరీదేవి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే మారెమ్మ ఆలయంలో అమ్మవారు సరస్వతి అలంకరణలో దర్శనమిచ్చా రు. భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఉరవకొండ: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉరవకొండలోని జగదీశ్వరీ అమ్మవారి ఆలయంలో అమ్మవారు సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త గాజుల శ్యామలమ్మ ఆధ్వర్యంలో వేదపండితులు సరస్వతీ హోమం, నవదుర్గ హోమం, గోపూజ ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. అలాగే ఉరగాద్రి చౌడేశ్వరీ ఆలయంలో అమ్మవారు సరస్వతిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ఆలయ ధర్మకర్త కొత్తశ్రీనివాసులు అధ్వర్యంలో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు.


వజ్రకరూరు: మహాలక్ష్మిగా లలితాత్రిపుర సుందరి


కణేకల్లులో సరస్వతీదేవిగా వాసవీమాత

హెచ్చెల్సీకి డిసెంబర్ 30 వరకూ నీరివ్వండి


హెచ్చెల్సీ అధికారులతో చర్చిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: నియోజకవర్గంలో హెచ్చెల్సీ, జీబీసీ కింద సాగైన పంటలను కాపాడేందుకు కెనాల్‌కు డిసెంబర్ 30 వరకూ నీరు విడుదల అయ్యేలా చూడాలని హెచ్చెల్సీ అధికారులను మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి కోరారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నవంబర్ 10న హెచ్చెల్సీకి నీరు నిలిపివేస్తున్నారు. ఈనేపథ్యంలో ఉరవకొండ నియోజకవర్గంలో హెచ్చెల్సీసీ, జీబీసీల కింద వేలాది ఎకరాల్లో సాగైన పంటల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారనుంది. దీంతో పంటలను ఎలా కాపాడాలనే అంశంపై చర్చించేందుకు శుక్రవారం అనంతపురం హెచ్చెల్సీ కార్యాలయంలో ఆ శాఖ ఎస్ఈ రాజశేఖర్, ఈఈ మోహనమూర్తి, డీఈ రఘు ఇతర అధికారులతో మాజీ ఎమ్మెల్యే సమావేశమయ్యారు. డిసెంబరు నెలాఖరు వరకూ నీటి విడుదలకు చర్యలు చేపట్టాలన్నారు. కనీసం ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో నీరు విడదల చేసేందుకు కృషి చేయాలని సూచించారు. లేకపోతే వేలాది ఎకరాల్లో సాగైన వరి, మిర్చి తదితర పంటలు ఎండి రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని నీటిని డిసెంబర్ 30 వరకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. హంద్రీనీవా నుంచి హెచ్చెల్సీకి నీటిని మళ్లించే అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పంటలు ఎండకుండా కాపాడాలన్నారు. దసరా పండుగ తరువాత క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులు అంచనా వేస్తామని, అలాగే ప్రత్యామ్నాయ అవకాశాలను కూడా పరిశీలిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

కూడేరు: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన కూడేరు పోలీసు స్టేషన్‌లో తనిఖీ చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేకాటను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టి రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు. కాగా సీఐని స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కలసి సన్మానించారు.

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

రాయదుర్గం రూరల్: మండలంలోని డి.కొండాపురం గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కొండయ్య తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్యులు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గుమ్మఘట్ట: మండలంలోని గలగల గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి శుక్రవారం తెలిపారు. గ్రామస్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పల్లె మురిసేలా .. ప్రగతి మెరిసేలా!

- 'గడప గడపతో' గ్రామాభివృద్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం

రాయదుర్గం: ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలను చేర్చాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం రాయదుర్గం నియోజకవర్గంలో విజయవంతంగా పూర్తికావచ్చింది. అర్బన్ సహా ఐదు మండలల్లోనూ వార్డు/గ్రామ సచివాలయాలు నియోజకవర్గంలో 96 ఉన్నాయి. వీటిలో 94 సచివాలయాల పరిధిలో ఇప్పటికే గడప గడపకూ మన ప్రభుత్వం పూర్తయింది. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ప్రతి ఇంటికీ వెళ్లి నాలుగేళ్ల పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన ఫలాలను వివరిస్తూ, బ్రోచర్ కార్డు అందించారు. పథకాల అమలులోనూ లోటుపాట్లు ఆరా తీశారు. స్థానిక సమస్యలు తెలుసుకుని సత్వరం పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ఎక్కడికక్కడ జనం తో మమేకమై వారి అభిమానాన్ని చురగొన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

రోడ్లు, డ్రైయిన్లు, తాగునీటి సమస్య పరిష్కారానికి విప్ అధిక ప్రాధన్యమిచ్చారు. ప్రతి సచివాలయం పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం పూర్తి చేసిన అనంతరం రూ.20 లక్షల నిధులను అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేటాయించారు. వీటి ప్రకారం నియోజకవర్గవ్యాప్తంగా విస్తారంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. పల్లె, పట్టణంలో గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా 522 పనులు గుర్తించగా, 289 ప్రొగ్రెస్‌లో ఉన్నాయి. 225 పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. వీటికి రూ.5.02 కోట్ల బిల్లులు చెల్లించారు.


పట్టణంలోని శాంతినగర్ లో పూర్తయిన సీసీరోడ్డు


ఆయతపల్లి ఎస్సీ కాలనీలో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణం

అంతా పారదర్శకమే..

అభివృద్ధి పనులు ప్రారంభించినప్పటి నుంచి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించే వరకూ మొత్తం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నారు. పనులు మొదలు పెట్టినప్పుడు ఫోటో తీసి అప్‌లోడ్ చేయడం ద్వారా ఎంపిక పూర్తవుతుంది. పనులు పూర్తయిన తర్వాత ఆయా శాఖల మండల ఇంజినీరింగ్, ఎంపీడీఓ అనుమతితో బిల్లులు అప్‌లోడ్ చేస్తారు. అనంతరం సదరు కాంట్రాక్టర్ల ఖాతాకు సీఎఫ్‌ఎంఎస్ ద్వారా నిధులు జమచేస్తారు.

డ్రైనేజీ పనులకు ప్రాధాన్యం



గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా మంజూరైన నిధుల్లో డ్రైనేజీ, తాగునీటి పనులకు అధిక ప్రాధాన్యం కల్పించాం. పల్లె, పట్టణ ప్రాంతాల్లో ప్రజలు పడే ఇబ్బందులకు గుర్తించి సమస్యలకు పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాం. అవసరమైన చోట తాగునీటి పైప్‌లైన్ల పునరుద్ధరణ, బోర్ల తవ్వకం, మోటార్ల ఏర్పాటు చేస్తున్నాం.

– స్టాలిన్, ఆర్‌డబ్ల్యూఎస్, డీఈ, అనంతపురం

చురుగ్గా సీసీ రోడ్డు పనులు



పల్లె, పట్టణంలో మట్టి రోడ్డన్నది లేకుండా సీసీ రహదారుల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యం కల్పించాం. గడప గడపకూ మన ప్రభుత్వం పూర్తయిన సచివాలయాల్లో విప్ ఆదేశాల మేరకు 373 సీసీ దారుల ఏర్పాటుకు చర్యలు చేపట్టాం. పనులన్నీ చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే 175 పనులు పూర్తయ్యాయి. మిగిలిన చోట్ల పనులు సాగుతున్నాయి.

– రామమోహన్‌రెడ్డి, పీఆర్ డీఈ, రాయదుర్గం

అభివృద్ధే లక్ష్యం



గడప గడపకూమన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని అర్బన్ తో పాటు ఐదు మండలాల్లోనూ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్నాం. వాటిని ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార చర్యలు చేపట్టాం. ప్రతి సచివాలయానికి ముఖ్యమంత్రి జగనన్న రూ.20 లక్షల నిధులు కేటాయించారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సీఎం పాలన సాగిస్తున్నారు.

– కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్

నేడు జగనన్న అర్బన్ మార్కెట్ స్టాల్ ప్రారంభం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట మెప్మా (పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) ఆధ్వర్యంలో శనివారం మెప్మా అర్బన్ మార్కెట్ స్టాల్ ప్రారంభించనున్నట్లు మెప్మా టీఎంసీ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు జగనన్న అర్బన్ మార్కెట్ స్టాల్‌ను ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డితోపాటు మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్పతోపాటు జిల్లా మెప్మా పీడీ విజయలక్ష్మి హాజరై ప్రారంభిస్తారన్నారు. ప్రభుత్వ చేయూతతో సుస్థిర జీవనోపాధుల కల్పనలో భాగంగా పొదుపు సంఘాల మహిళలు స్వయం ఉపాధితో తయారు చేసిన ప్రోడక్ట్స్‌ను విక్రయానికి ఉంచుతామన్నారు.

సెబ్ పోలీస్ స్టేషన్ తనిఖీ

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గంలోని సెబ్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా సెబ్ అడిషనల్ ఎస్పీ రామకృష్ణ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా సెబ్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. అనంతరం పట్టు బడిన వాహనల రికార్డులను తనిఖీ చేశారు. మద్యం అక్రమ రవాణాను అరికట్టాలని ఎస్ఐ కృష్ణనాయక్, సెబ్ పోలీసులకు సీఐ సూచించారు.